ప్రభుత్వ కళాశాల అడ్మిషన్ డ్రైవ్

ధర్పల్లి(సిరికొండ), మే 28 : ధర్పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ ఇంగ్లిష్, తెలుగు మీడియం గ్రూపులకు అడ్మిషన్లు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రజీయొద్దీన్ అస్లాం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని దమ్మన్నపేట్ గ్రామంలో విద్యార్థుల వద్దకు వెళ్లి అడ్మిషన్లు స్వీకరించారు. అన్ని సౌకర్యాలు, అనుభవం గల అధ్యాపకులు ఉన్న కళాశాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు.

బీరప్ప ఆలయంలో ఒగ్గుకథ

కార్యక్రమానికి హాజరైన తిర్మన్‌పల్లి గ్రామస్తులు

సారంగాపూర్, మే 28 : మండలంలోని తిర్మన్‌పల్లి గ్రామంలో బీరప్ప దేవాలయ వార్షికోత్సవ వేడుకలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం కుర్మ సంఘం ఆధ్వర్యంలో ఒగ్గు కథ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ ఒగ్గు కథను వినడానికి గ్రామస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా.. కుర్మ కుల సంఘం పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న డిగ్రీ పరీక్షలు

డిచ్‌పల్లి, మే 28 : టీయూలో మంగళవారం ఉదయం డిగ్రీ 5వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు, మధ్యాహ్నం ఒకటో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. నిజామాబాద్‌లోని గౌతమి డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రంలో ఇద్దరు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడ్డారు.వర్సిటీ పరిధిలో 38 కేంద్రాల్లో ఉదయం జరిగిన పరీక్షకు 7042 మంది విద్యార్థులకు 6697 మంది, మధ్యాహ్నం పరీక్షలకు 1722 విద్యార్థులకు 1622 మంది హాజరయ్యారు. నిజామాబాద్, కామారెడ్డిలోని పలు పరీక్షా కేంద్రాలను ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య చంద్రశేఖర్, జాయింట్ డైరెక్టర్ అతీక్ సుల్తాన్ ఘోరీ తనిఖీ చేశారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్లో వేగంపెంచాలి

తిమ్మాపూర్ ప్రభుత్వపాఠశాలలో పనులను పరిశీలిస్తున్న డీఈవో

మోర్తాడ్, మే28: అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో భాగంగా పాఠశాలల్లో నిర్వహిస్తున్న వివిధ పనుల్లో వేగం పెంచాలని డీఈవో దుర్గాప్రసాద్ అధికారులకు సూచించారు. మంగళవారం తిమ్మాపూర్, పాలెం, శెట్‌పల్లి, ధర్మోరా, దొన్కల్, గాండ్లపేట్ గ్రామాల్లోని పాఠశాలల్లో కొనసాగుతున్న పనులను పరిశీలించారు. పనులను స్థానిక అధికారులు, ఉపాధ్యాయులు పర్యవేక్షిస్తూ త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. ఆయన వెంట ఎంఈవో ఆంధ్రయ్య, సీఆర్‌పీ సాయిరాం, ప్రధానోపాధ్యాయులు మగ్గిడి ప్రవీణ్, వేణుగోపాల్‌రావు, మగ్గిడి శంకర్, వీవోలు ఉన్నారు.

'నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నాం'

ఖలీల్‌వాడి, మే 28: నగరంలోని డి-1 సెక్షన్ పరిధి 58వ డివిజన్ దారుగల్లీలో అహ్మద్‌బజార్ హెడ్ పోస్టాఫీస్ ప్రాంతాల్లో నాణ్యమైన విద్యుత్‌ను అందించడానికి కృషి చేస్తున్నామని ఏడీ తోట రాజశేఖర్ తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ల స్థాయిని పెంచామని, హెడ్ పోస్టాఫీస్ ప్రాంతం, మీసేవ దారుగల్లీలో 315 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అహ్మద్ బజార్, లైన్‌గల్లీలో రెండు 160 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు బిగించామని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఈ టౌన్ చంద్రశేఖర్, నగేశ్ పాల్గొన్నారు.

'సెల్ టవర్ పనులు నిలిపి వేయాలి'

ఆర్మూర్‌టౌన్,మే28: సెల్ టవర్ నిర్మాణ పనులను నిలిపివేయాలని కోరుతూ పట్టణంలోని 7వ వార్డుకు చెందిన తిరుమల కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రాజుకు వినతిపత్రాన్ని అందజేశారు. కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు మాట్లాడుతూ జనావాసాల మధ్య సెల్ టవర్ నిర్మించడంతో ప్రజలు అనారోగ్యాల బారిన పడే ప్రమదం ఉందని అన్నారు. టవర్ నిర్మాణ పనులను వెంటనే నిలిపివేయాలని కోరారు.

ఒకరిపై మాల్ ప్రాక్టీస్ కేసు

ఖలీల్‌వాడి, మే 28: నిజామాబాద్ జిల్లాలో ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగాయని జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి రవికుమార్ తెలిపారు. మంగళవారం మొదటి సంవత్సరం గణితం, బోటనీ, సివిక్స్ పరీక్షలు నిర్వహించగా మొత్తం విద్యార్థులు 8,340 మంది విద్యార్థులకు 7,882 మంది హాజరుకాగా 458 మంది గైర్హాజరయ్యారు. డిచ్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకరు మాల్ ప్రాక్టీస్ చేస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేశారు. సెకండియర్‌లో 3,446 మంది విద్యార్థులకు 3,281 మంది హాజరుకాగా 165 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

నకలీ విత్తనాలపై రైతులకు అవగాహన

జల్లాపల్లిలో నకలీ విత్తనాల పై అవగాహన కల్పిస్తున్న ఏఈవో సుప్రియ

కోటగిరి, మే 28: పొతంగల్ మండలంలోని జల్లాపల్లి ఫారంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఏఈవో సుప్రియ ఆధ్వర్యంలో నకిలీ విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సుప్రియ మాట్లాడుతూ.. లైసెన్స్ కలిగి ఉన్న డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. విత్తనాల కొనుగోలు విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. గుడ్డ సంచుల్లో అమ్మే విత్తనాలను కొనుగోలు చేయొద్దని, గ్రామాల్లో ఎవరైనా అమ్మితే వ్యవసాయ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. విత్తనాలు కొనుగోలు చేసి తప్పని సరిగా రసీదు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఫీల్డ్ అసిస్టెంట్ దేవీసింగ్ పాల్గొన్నారు.

లైసెన్స్‌డ్ డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేయాలి

మోర్తాడ్, మే28: వ్యవసాయశాఖ ద్వారా లైసెన్సు పొందిన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని వ్యవసాయాధికారులు సూచించారు. మంగళవారం ఉప్లూర్, చౌట్‌పల్లి, డీసీతండా, ఇనాయత్‌నగర్ గ్రామాల్లో రైతులకు విత్తనాల కొనుగోలు విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. రశీదు, విత్తన సంచి పంటకాలం పూర్తయ్యే వరకు జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమాల్లో ఏఈవోలు సాయిరాంరాజు, రమేశ్, పద్మ, రైతులు పాల్గొన్నారు.

ఉప్లూర్‌లో శిలీంద్రం వాడకంపై అవగాహన

ట్రైకోడెర్మా విరిడె శిలీంద్రంను వినియోగించే విధానంపై కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ గ్రామంలో జీవని యంత్రణ ప్రయోగశాల నిజామాబాద్ నుంచి వచ్చిన వ్యవసాయాధికారిణి శృతి రైతులకు అవగాహన కల్పించారు. ట్రైకోడెర్మా విరిడె పసుపులో దుంపకుళ్లు రాకుండా చేస్తుందని, సోయాబీన్, మొక్కజొన్న పంటల్లో ఎండుతెగులు రాకుండా చేస్తుందని చెప్పారు. ట్రైకోడెర్మా విరిడె శిలీంద్రంను ఉపయోగించి విత్తనశుద్ధి ఏవిధంగా చేయాలో రైతులకు ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. కార్యక్రమంలో ఏఈవో రమేశ్, రైతులు పాల్గొన్నారు.

ఉప్లూర్ గ్రామంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో

బోల్తాపడిన పంచాయతీ ట్యాంకర్

బోల్తాపడిన ట్యాంకర్

రుద్రూర్, మే 28: మండలంలోని సులేమాన్‌నగర్ గ్రామ శివారులో పంచాయతీ నీటి ట్యాంకర్ మంగళవారం బోల్తాపడింది. పంచాయతీకి సంబంధించిన ట్యాంకర్‌ను అదే గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలోని నారుమడికి నీటిని తరలిస్తుండగా అదపు తప్పి ట్రాక్టర్ ట్యాంకర్‌తో సహా పల్టీ కొట్టింది. ఈ విషయమై పంచాయతీ అధికారులను సంప్రదించగా పంచాయతీ ట్రాక్టర్‌ను కిరాయికి ఇచ్చామని, అనుకోకుండా బోల్తాపడినట్లు సమాధానమిచ్చారు. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి



వర్నిలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పోచారం సురేందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, అభిమానులు

బోధన్/నందిపేట్/ముప్కాల్/ కోటగిరి/ఖిలీల్‌వాడి/ వర్ని, మే 28: జిల్లాలోని పలు మండలాల్లో మంగళవారం టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ సీఎం ఎన్టీఆర్ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోటగిరి, వర్నిలో ఎన్టీఆర్ విగ్రహానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. వర్ని మండల కేంద్రంలో కమ్మ సంఘం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పోచారం సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలుగు జాతి స్ఫూర్తి, కీర్తి ఎన్టీఆర్ అని పేర్కొన్నారు. ఎన్టీఆర్ సేవలను కొనియాడారు. దేశంలోనే మొదటిసారిగా సంక్షేమపాలనకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ శంకర్‌పటేల్, మాజీ సర్పంచ్ పత్తి లక్ష్మణ్, విండో చైర్మన్ కూచి సిద్దూ తదితరులు పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌లో ఉన్న టీడీపీ కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ అధ్యక్షుడు అంబిక సత్యనారాయణ, అర్బన్ ఇన్‌చార్జి వినోద్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. ఎన్టీఆర్‌కు భారతరత్న అవార్డు ఇవ్వాలని కోరారు. బోధన్ పట్టణంతోపాటు పెంటకుర్దు, జాడిజమాల్‌పూర్, సాలూర క్యాంప్ తదితర గ్రామాల్లో ఎన్టీఆర్ జయంతిని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నిర్వహించారు. బాటసారులకు మజ్జిగా వితరణ చేశారు. ఆ పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి, న్యాయవాది సీహెచ్ హన్మంత్‌రావు, టీడీపీ బోధన్ ఇన్‌చార్జి గోపాల్‌రెడ్డి, ఎన్టీఆర్ అభిమాన సంఘం నాయకులు శివన్నారాయణ, పావూలూరి వెంకటేశ్వర్‌రావు, సచిన్‌పటేల్, విఠల్‌పటేల్, ఉదయ్ భాస్కర్, విశ్వేసర్‌రావు తదితరులు పాల్గొన్నారు. నందిపేట్ మండల కేంద్రంలో ప్రధాన కూడలి వద్ద ఎన్టీఆర్ చిత్రపటానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా నాయకులు ఆనంద్, లక్ష్మీపతి పాల్గొన్నారు.

ముప్కాల్ మండల కేంద్రంలోని టీడీపీ జెండా వద్ద ఎన్టీఆర్ వీరాభిమానులు ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ముస్కు ముత్తెన్న, డాక్టర్ రాములు, రాములు, ముస్కు భూమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలు తెరుచుకునేలోగా

పనులు పూర్తి చేయాలి

కోటగిరి, మే 28: పాఠశాలలు ప్రారంభం అయ్యే నాటికి ప్రగతి పనులు పూర్తి చేయాలని డీఎల్‌పీవో సాయిబాబా అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో ప్రాథమికొన్నత, ప్రాథమిక పాఠశాలల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పనుల్లో వేగం పెంచాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో మనోహర్‌రెడ్డి, ఏఈ తదితరులు ఉన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల తనిఖీ

డిచ్‌పల్లి, మే 28 : మండలంలోని ధర్మారంలో ఉన్న అమ్మ ఆదర్శ పాఠశాలను మండల ప్రత్యేకాధికారి యోహాన్, ఎంపీడీవో శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. మండలంలోని బర్దిపూర్, ధర్మారం, చెరువుకట్ట తండా, నడ్పల్లి, అమ్మతాపూర్, గాంధీనగర్ గ్రామాల్లో పర్యటించి కొనసాగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట పీఆర్ ఏఈ శ్రీధర్, పంచాయతీ కార్యదర్శి కిషన్‌రావు తదితరులున్నారు.

ధర్మారం పాఠశాలను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి

బాధితుడికి ఫోన్ అందజేత

ఏర్గట్ల, మే 28: మండలంలోని తాళ్ల రాంపూర్‌కు చెందిన గుండ రాజు ఇటీవల ప్రయాణం చేసే సమయంలో తన రెండు ముబైల్ ఫోన్లు పోయాయి. ఏర్గట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై మచ్చేందర్‌రెడ్డి సీఈఐఆర్ పోర్టల్ సహకారంతో ఫోన్లను వెతికారు. మంగళవారం బాధితుడిక ఫోన్లు అందజేశారు.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలి

ఎస్సై హరిబాబుకు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

భీమ్‌గల్, మే28: బేజ్జోర కప్పల వాగు నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై హరిబాబు, తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఎంపీపీ మహేశ్, జడ్పీటీసీ రవి, పార్టీ మండల అధ్యక్షుడు దొన్కంటి నర్సయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోందని అన్నారు. అనుమతులు లేకుండా ఇసుకను ఎక్కువ ధరకు ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని మండిపడ్డారు. మండలంలో రెండు ప్రభుత్వ ఇసుక రీచ్‌లు ఉన్నాయని, బెజ్జోరాలో అక్రమ ఇసుక దందా కొనసాగుతోందని అన్నారు. సంబంధిత అధికారులు స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ భగత్, కౌన్సిలర్లు ప్రసాద్, నర్సయ్య, సతీశ్, ఎంపీటీసీలు స్వామి, సాయిప్రసన్న, రాజేశ్వర్, పార్టీ నాయకులు రవి, సురేశ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్‌సీ నిధులు మంజూరు చేయాలని తీర్మానం

సమావేశంలో మాట్లాడుతున్న కార్యదర్శి రాణి

రెంజల్, మే 28: మండలంలోని నీలా గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ ప్రత్యేక అధికారి మున్నీ నాయక్ అధ్యక్షతన సాధారణ సమావేశం మంగళవారం నిర్వహించారు. జీపీలో నిధుల కొరత ఉందని, నాలుగు నెలలుగా పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు చెల్లించని పరిస్థితి నెలకొందని జీపీ కార్యదర్శి రాణి పేర్కొన్నారు. గ్రామంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారిందని వెల్లడించారు. ప్రభుత్వం ఎస్ఎఫ్‌సీ నిధులను మంజూరు చేయాలని తీర్మానించినట్లు ఆమె పేర్కొన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ యోగేశ్, గ్రామ పెద్దలు హాజరయ్యారు.

వానకాలం సీజన్‌పై రైతుల అవగాహన

సిరికొండ, మే 28: మండలంలోని పెద్దవాల్గోట్, న్యావనంది, ముషీర్‌నగర్, హుస్సేన్‌నగర్, పందిమడుగు గ్రామాల్లో వానకాలం సీజన్ వ్యవసాయంపై వ్యవసాయశాఖ అధికారులు మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రైతులు విత్తనాలను కొనుగోలు చేసేటప్పుడు రసీదు తీసుకోవాలని సూచించారు. విత్తనాల సంచులు పంటకాలం అయిపోయేంతవరకు ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

కార్మికులంతా ఏకం కావాలి

సిరికొండ, మే 28 : తమ సమస్యల పరిష్కారం కార్మికులంతా ఏకం కావాలని ఏఐపీకేఎంఎస్ రాష్ట్ర ప్రధా, కార్యదర్శి రామకృష్ణ పిలుపునిచ్చారు. మండలంలోని గడ్కోల్ గ్రామంలో ఉపాధి కూలీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూమి లేని పేదల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతుందని, మరోవైపు ఉపాధి కరువై వలసలు వెళ్లాల్సిన దయనీయమైన స్థితి నెలకొందన్నారు. వ్యవసాయ కూలీలను ఓట్ల కోసమే వాడుకోవడం తప్ప వారి సంక్షేమాన్ని ఏనాడు పట్టించుకోలేదన్నారు. వ్యవసాయ కూలీలు తాము ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పోరాటమే ఏకైక మార్గం తప్ప మరొకటి లేదన్నారు. సమావేశంలో రమేశ్, కిశోర్, సాయారెడ్డి, రమేశ్, దామోదర్, లింబాద్రి, అనిల్, బాల్‌రెడ్డి, ఎర్రన్న, సంతోష్ పాల్గొన్నారు.

పోరాటాల ఫలితమే కార్మికుల వేతనాల పెంపు

సిరికొండ, మే 28 : పోరాటాల ఫలితమే బీడీ కార్మికుల మూల వేతనాల పెంపు అని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి రమేశ్ అన్నారు. మండల కేంద్రంలోని యూనియన్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని బీడీ పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికుల అగ్రిమెంట్ ఈ నెల 24, 25తో ముగిసిందని తెలిపారు. నూతన వేతన ఒప్పందంపై బీడీ కంపెనీ యజమానులకు డిమాండ్ లెటర్ ఇచ్చినట్లు చెప్పారు. బీడీ కార్మికులకు వేతనం పెంచాలని, ఒప్పందం ప్రకారం బీడీ యజమానులు బీడీ కార్మిక సంఘాలు శాంతియుతంగా చర్చలు జరిపి పరిష్కరించాలని కోరారు. సమావేశంలో ఏరియా అధ్యక్షురాలు రఘు, నాయకులు పుష్పలత, మల్కి మణెమ్మ, లావణ్య, లత పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవీపేట, మే 28: యంచ తాజా మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు లహరి ప్రవీణ్‌కుమార్ తండ్రి సోమవారం రాత్రి మృతి చెందగా మంగళవారం నిర్వహించిన అంత్యక్రియలకు జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు హాజరయ్యారు. బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు. స్థానిక బీఆర్ఎస్ నాయకులు నర్సింగ్‌రావు, రాజేశ్వర్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఆర్మూర్‌టౌన్, మే28: పోలీస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలోనే ఆర్టీసీ డిపో పక్కన చెట్ల పొదల్లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. నట్లు పోలీసుల కథనం మేరకు.. మంగళవారం ఉదయం చెట్ల పొదల్లో మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేసుకొని పరిశీలించారు. మృతుడు తెల్ల చొక్కా, బూడిద రంగు ప్యాంటు ధరించి ఉన్నట్లు పోలీసలు తెలిపారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో రవి కుమార్ తెలిపారు.

చెరువులో పడి పశువుల కాపరి మృతి

ఆలూర్, మే28: మండలంలోని రాంచంద్రపల్లి శివారులో ఉన్న సింగ సముద్రం చెరువులో పడి అదే గ్రామానికి చెందిన పశువుల కాపరి లస్మయ్య(65) మృతి చెందినట్లు ఎస్సై సుధీర్ తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. సోమవారం లస్మయ్య బర్లను చెరువులోకి తోలి ఆయన కూడా నీటిలో దిగాడు. నీటిలో మునిగి ఊపిరాడక మృతి చెందాడు. మృతుడి భార్య దుర్గమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్ ఢీకొని ఒకరి మృతి

నవీపేట, మే 28: పాల్దా సమీపంలో వెంకటలక్ష్మి రైస్‌మిల్ వద్ద మంగళవారం బైక్ ఢీ కొట్టిన ఘటనలో ఓ సైకిలిస్టు అక్కడిక్కడే మృతి చెందాడు. ఎస్సై యాదగిరిగౌడ్ కథనం ప్రకారం.. మండలంలోని జన్నేపల్లి గ్రామానికి చెందిన చాట్ల నరేందర్(46) పాల్దా శివారులో ప్లాస్టిక్ కంపెనీలో కూలీగా పని చేస్తున్నాడు. రోజు వారి పనిలో భాగంగా స్వగ్రామం నుంచి విధులకు సైకిపై వెళ్తున్నాడు. అదే గ్రామానికి చెందిన రాజేశ్ బైక్‌పై నిజామాబాద్ వైపు వెళ్తూ వెనుక నుంచి బలంగా ఢీ కొట్టాడు. చాట్ల నరేందర్‌కు తీవ్ర గాయాలు కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మీనర్సు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అప్పులబాధతో వివాహిత ఆత్మహత్య

వాసంతి (ఫైల్)

భీమ్‌గల్, మే 28: అప్పుల బాధ భరించలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఎస్సై హరిబాబు తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. పట్టణానికి చెందిన పాల్వంచ వాసంతి(35) మెప్మాలో కొన్నేండ్లుగా ఎస్ఆర్‌పీగా విధులు నిర్వహిస్తోంది. అప్పుల భాధ ఎక్కువ కావడంతో మంగళవారం మధ్యాహ్నం తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. భర్త శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు దర్యప్తు చేస్తున్నటు ఎస్సై తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం.. కాపర్ చోరీ

మాక్లూర్, మే 28: మండలంలోని అమ్రాద్ గ్రామంలోని బొర్ర మధుకు చెందిన వ్యవసాయ పొలంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను దుండగులు సోమవారం రాత్రి ధ్వంసం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ కాయల్స్, ఆయిల్‌ను దొంగలించారు. మాక్లూర్ పోలీసులు, ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేశానని, రూ.10 వేల నష్టం జరిగిందని రైతు తెలిపాడు.

ఆర్టీసీ బస్సు నుంచి పొగలు.. తప్పిన ప్రమాదం

ఆర్మూర్‌టౌన్, మే28: నిజామాబాద్ నుంచి నిర్మల్‌కు వెళ్తున్న నిజామాబాద్-2 ఆర్టీసీ బస్సు వెనకభాగం నుంచి పొగలు డ్రైవర్ రోడ్డు పక్కన నిలిపివేశాడు. నిజామాబాద్ నుంచి వస్తున్న బస్సు వెనుక భాగం నుంచి పొగలు రావడంతో బస్సు వెనకాల ఉన్న వాహనదారులు చూసి డ్రైవర్‌కు తెలిపారు. దీంతో డ్రైవర్ వెంటనే బస్సును నిలిపివేసి 82 మంది ప్రయాణికులను దింపివేశాడు. వారిని వేరే బస్సులో ఎక్కించి బస్సును ఆర్మూర్ డిపోనకు తరలించారు. పెద్ద ప్రమాదం తప్పిందని ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.

యువతి అదృశ్యం

విహారిక

బాల్కొండ, మే 28: మండలంలోని శ్రీరాంపూర్‌కు చెందిన 20 ఏండ్ల గాదారి విహారిక అదృశ్యమైనట్లు తండ్రి చిన్నయ్య ఫిర్యాదు చేశాడని ఏఎస్సై శంకర్ తెలిపారు. ఆర్మూర్‌లోని సాహితీ ఇన్‌స్టిట్యూట్‌లో టైలరింగ్ నేర్చుకునేందుకు యువతి శ్రీరాంపూర్ నుంచి వెళ్లింది. తిరిగి ఇంటికి రాలేదని తల్లి గోదావరి, తండ్రి చిన్నయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

ప్రభుత్వ స్థలాన్ని కాపాడిన అధికారులు

-రూ.2 కోట్ల విలువైన భూమిని కబ్జా చేసేందుకు వ్యాపారుల ప్రయత్నం

ఆర్మూర్‌టౌన్, మే29: పట్టణంలోని కోటార్మూర్‌లోని రూ.2కోట్ల విలువ గల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ గజానన్ మంగళవారం తెలిపారు. కోటార్మూర్‌లోని సర్వే నంబర్ 31లో 1089 గజాల(9గుంటల) స్థలాన్ని మొదట ఓ ప్రైవేట్ వెంచర్‌లో కలుపుకునేందుకు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రయత్నించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతుడు స్పందించి సర్వే చేయాలని రెవెన్యూ, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. దీంతో మండల సర్వేయర్ శికారి రాజు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అశోక్ సింగ్, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి ప్రవీణ్ సర్వే చేసి ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి హద్దులు పాతారు. ఈ స్థలం చుట్టూ త్వరలో కంచె వేసి ప్రభుత్వ భూమి అని బోర్డు ఏర్పాటు చేస్తామని తహసీల్దార్ తెలిపారు.

విద్యుత్ పునరుద్ధరణ పనులు త్వరగా చేపట్టాలి

రుద్రూర్, మే 28: మండల పరిధిలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు త్వరగా చేపట్టాలని కోరుతూ రైతులు రుద్రూర్ ఏడీ రవికుమార్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. రెండు రోజుల క్రితం వీచిన ఈదురుగాలులకు విద్యుత్ స్తంభాలు నేలకూలడంతో విద్యుత్ సరఫరాలు నిలిపివేశారని తెలిపారు. వేసిన నారు మడులకు నీరు అవసరం ఉందని, లేదంటే నారుమడులు ఎండిపోతాయన్నారు. వీలైనంత త్వరగా పునరుద్ధరణ పనులు చేపట్టి ఆదుకోవాలని కోరారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

I, MADAVEDI MOUNIKA D/o. MADAVEDI GOVARDHAN (Old Name) After Marriage changed my Name as YERROLLA LAYASRI W/o. YERROLLA PRAVEEN (New Name) R/o.H.No.4-38/2, Vill: Ravutla, Mdl: Sirikonda, Dist. Nizamabad.

WANTED

★ అర్జెంట్‌గా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & ITI మెకానిక్స్ కావలెను. మంచి జీతం, వసతి సౌకర్యం కలదు. సంప్ర: 9392663777, 9246663777, 9290003999.
NT-339514-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/-